ఈనాడు
రాజన్న సిరిసిల్ల

అవగాహన కొరవడి.. దరఖాస్తు సమర్పణలో తడబడి

గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల సాయం



కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో గీత కార్మికుడిగా పని చేసే ఎల్లయ్య (42) భార్య రేణుక ఇంటి వద్ద బీడీలు చుడుతుంది. ఉపాధి కోసం పదేళ్లుగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నాడు. అక్కడ పని చేస్తూనే ఇద్దరు అక్కలు, ఒక చెల్లికి పెళ్లిళ్లు చేశాడు. ఏడాది క్రితం తనకు ఉన్న ఎకరం విక్రయించి, మరింత అప్పు చేసి దుబాయ్ వెళ్లాడు. అక్కడ సరైన ఉపాధి లేక చేసిన అప్పు ఎలా తీర్చాలోనని మనోవేదనతో జూన్ 4న ఆత్మహత్య చేసుకున్నాడు. ధ్రువపత్రాలన్నీ ఉన్నా ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నారు.

ఈనాడు, సిరిసిల్ల

ఉపాధి వేటలో ఎందరో నిరుద్యోగులు గల్ఫ్ బాట పడుతున్నారు. ఇక్కడి ఏజెంట్లు మంచి జీతం, ఉద్యోగం అని రంగుల కలను చూపిస్తున్నారు. తీరా ఆ దేశాలకు వెళ్లాక అక్కడ చేయించే పనులు వేరే ఉంటున్నాయి. పని వీసా అని చెప్పి పర్యాటక వీసాతో పంపుతుంటారు. వీటి నుంచి తేరుకున్నా తిరిగి రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అక్కడికి వెళ్లేందుకు చేసిన అప్పులే ఇందుకు కారణం. వాటిపై వడ్డీల భారం గుర్తుకొస్తుంది. దీంతో పనిభారం, మానసిక ఒత్తిడి, అనారోగ్యంతో కొందరు, ప్రమాదాల్లో మరికొందరు మృతి చెందుతున్నారు. దీంతో ఇక్కడి వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. అలాంటి వారికి భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే గల్ఫ్ మృతుల కుటుంబాలు ఈ పరిహారం ఎలా పొందాలి, ఎవరిని సంప్రదించాలనే దానిపై అవగాహన కొరవడింది.

ఏడు దేశాలకు వర్తింపు

గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ దేశాల్లో మరణించిన వారికి వర్తిస్తుంది. బాధిత కుటుంబాలు మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు రద్దు చేసినట్లు ధ్రువీకరణను దరఖాస్తుతో సమర్పించాలి.

- ఆయా దేశాల్లో ఉద్యోగం, ఉపాధి పొందుతున్నట్లుగా వర్క్ వీసా, ఉద్యోగం చేస్తున్న సంస్థ వివరాలు ఉండాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి. వీటిని గల్ఫ్ కార్మికుడు చనిపోయిన రోజు నుంచి కానీ, మృతదేహం కుటుంబ సభ్యులకు అందిన రోజు నుంచి కానీ ఆరు నెలల్లో కలెక్టర్‌కు సమర్పించాలి.

గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న రాష్ట్ర కార్మికులు అక్కడ ఏ కారణంతో మరణించినా వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం రూ.10.60 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. 2023 డిసెంబరు 7 నుంచి మరణించిన వారికి ఈ సాయం వర్తిస్తుంది. ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 160 మంది పలు కారణాలతో మృతి చెందినట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాలు గుర్తించాయి. వీరిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారు 50 మంది వరకు ఉంటారు.



గంభీరావుపేటకు చెందిన పెంట దేవయ్య (46)కు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మత్స్యకారుడిగా పని చేసే దేవయ్య పదేళ్లుగా ఉపాధి కోసం మస్కట్ వెళ్లి వస్తుండేవాడు. రెండేళ్ల క్రితం రూ.2 లక్షలు అప్పు చేసి ఆగస్టు 19న దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న క్రమంలో ఆగస్టు 27న గుండెపోటుతో మృతి చెందాడు. 50 రోజులకు మృతదేహాన్ని స్వగ్రామం పంపారు. ప్రభుత్వ పరిహారం అందితే అప్పు తీర్చి పిల్లల బాగోగులు చూసుకోవాలనుకుంటుంది శ్యామల.

- దరఖాస్తులను స్థానిక తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపుతారు. నిర్ధారించాక నేరుగా బాధిత కుటుంబ సభ్యుడి బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమవుతుంది.
- పరిహారం పొందేందుకు పని వీసా, ఉద్యోగ ఒప్పంద పత్రం సమర్పించాలి. అయితే కొందరు ఇక్కడి ఏజెంట్ల మాయ మాటలో పడి పర్యాటక వీసాపై వెళ్లినవారు, పని ఒత్తిడి తట్టుకోలేక వేరే చోటుకు వెళ్లి పని చేస్తున్నవారు, అర్ధంతరంగా చనిపోయిన వారి ఆధారాలు ఎలా సమర్పించాలనే ఆందోళన కూడా ఉంది.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు కూడా ఉపాధి కోసం వెళ్తుంటారు. మిగతా దేశాల్లోని కార్మికులకు కూడా పరిహారం వర్తింపజేయాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

అసంపూర్తి వంతెన నిర్మాణానికి అడుగులు

భూసేకరణకు రూ.6.96 కోట్లు మంజూరు

న్యూస్‌టుడే, వేములవాడ

గత రెండేళ్లుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన వేములవాడలోని మూలవాగుపై వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో అడ్డంకులు తొలగిపోనున్నాయి.

ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణంతో పాటు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.28 కోట్ల కోర్‌నెట్ నిధులను మంజూరు చేసింది. ఇందులో వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లను కేటాయించారు. దీంతో పనులు చేపట్టిన గుత్తేదారు మూలవాగుపై పడమర వైపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండో వంతెన పనులు మొదలు పెట్టినప్పటికీ భారీ వర్షాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వంతెన నిర్మాణంలో పనులు ఆగుతూ సాగుతూ చివరికి నిలిచిపోయాయి.

నిర్మాణం ఇలా...

మూలవాగుపై వంతెనల నిర్మాణంతో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు. 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో పడమర వైపు వంతెన పూర్తయి వినియోగంలోకి రాగా, రెండోది మధ్యలో ఆగిపోయింది. దీంతో పాటు వంతెనకు ఇరువైపులా కూడళ్లను ఆధ్యాత్మికత ఉట్టి పడేలా సుందరీకరణ చేయాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. వంతెన నిర్మాణ ప్రాంతాల్లో భూములు, ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం అందించేందుకు రూ.6.96 కోట్లను ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసింది. వంతెన పనులకు మరో రూ.3 కోట్లను మంజూరు చేసింది. దీంతో రెండో వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది.



మూలవాగులో నిలిచిపోయిన వంతెన పనులు



భూసేకరణ చేయాల్సిన ప్రాంతం

2018లో పూర్తి చేయాల్సి ఉన్నా...

మూలవాగు వంతెనల నిర్మాణ పనులు 2015 ప్రారంభమైనప్పటికీ ఒప్పందం ప్రకారం 2018 సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉంది. మొదటి వంతెన సకాలంలో పూర్తయినప్పటికీ, ఏటా అవాంతరాలు ఏర్పడటంతో రెండోది కాలేదు. ఈ వంతెన మొదలు పెట్టినప్పటి నుంచి భారీ వర్షాలకు మూడేళ్లలో మూడు సార్లు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో పనులు ఎప్పుడూ సాఫీగా జరిగిన దాఖలాలు లేవు. రెండో స్టాండ్ బీమ్‌ల నిర్మాణ సమయంలో భారీ వర్షాలకు కుంగిపోయింది. ఆ తరవాత రెండు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయి బీమ్‌లు వంగిపోయాయి. ఏటా సెంట్రింగ్ పనులు చేయడం, భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో గుత్తేదారు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. దీంతో రెండేళ్లుగా పనులు పూర్తిగా ఆగిపోయాయి.

త్వరలో పూర్తికి చర్యలు

మూలవాగులో నిలిచిపోయిన రెండో వంతెన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు రూ.6.96 కోట్లను మంజూరు చేయడం జరిగింది. గత ప్రభుత్వం భూసేకరణకు నిధులు కేటాయించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. గుత్తేదారును కూడా మార్చాం. టెండరు ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో?



తిమ్మాపూర్‌లో ధాన్యం కుప్పలు

వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందుర్తి మండలంలోని గ్రామాల్లో ఇప్పటి వరకు ఒక్కచోట కూడా ఏర్పాటు చేయలేదు. మరోవైపు అకాల వర్షాల కారణంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంట తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనిని అదనుగా తీసుకుని దళారులు రైతుల దగ్గరి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో చందుర్తి, సనుగులలో పీఏసీఎస్‌లు ఉన్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, చందుర్తి

విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేక దృష్టి సారించండి

రుద్రంగి, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాసేపు ఆయన ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాల వంట సామగ్రి నిల్వ గదిని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి వనిత తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగి కస్తూర్బాలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తికి ఆదేశం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పురోగతిపై సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాలు, ఇతర గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మొత్తం 42,942 దరఖాస్తుల వివరాలను మండలాల వారీగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నాలుగు దశలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. దరఖాస్తులను సర్వే నంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం, మున్సిపాలిటీలో బృందాలు పరిశీలించి జీపీఎస్ ద్వారా సదరు భూమి కోఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేయాలన్నారు. అదే సమయంలో ఈ భూముల నీటి వనరుల బఫర్ జోన్ నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోకి వస్తుందో, లేదో పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన స్థలాల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయి సర్వే ధ్రువీకరణ పూర్తి చేసి దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణ పక్కాగా చేయాలన్నారు. మొదటి దశలో ధ్రువీకరణ పూర్తి చేసుకున్న దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, లేదా అని పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారి ఆమోదించాలని చెప్పారు. క్రమబద్ధీకరణకు జనరేట్ అయిన ఫీజు వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేసి త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఇన్‌ఛార్జి డీపీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ ఆలీబేగ్, సంపత్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దుమారం రేపిన హత్య



- ఘటనను నిరసిస్తూ రహదారిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయింపు
- జగిత్యాలలో 4 గంటలపాటు ఆందోళన

న్యూస్‌టుడే, జగిత్యాల, జగిత్యాల గ్రామీణం



ఘటనా స్థలంలో గంగారెడ్డి ద్విచక్రవాహనం, నిందితుడి కారు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మారు గంగారెడ్డి హత్య పెను దుమారం లేపింది. గంగారెడ్డి హత్యకు వ్యక్తిగత కక్షలు ఉన్నప్పటికీ రాజకీయ రంగు పులుముకోవడంతో జగిత్యాలలో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు జాబితాపూర్ గ్రామంలో గంగారెడ్డి అత్యంత దారుణంగా హత్యకు గురికాగా మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తేగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. సుమారు 4 గంటలపాటు పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఒక దశలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవమానాలే మిగులుతున్నాయని ఆవేదన చెందారు. పార్టీ ఫిరాయించిన వ్యక్తి ప్రోద్బలంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పోలీసులు, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లేందుకు వారు సిద్ధపడగా పోలీసులు అడ్డుకున్నారు. జీవన్‌రెడ్డి సైతం కార్యకర్తలను నిలువరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా జీవన్‌రెడ్డి ఓటమి చెందారు. భారాస నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలోనే తీవ్ర నిరాశ చెందిన జీవన్‌రెడ్డిని అధిష్ఠానం బుజ్జగించింది. ఇద్దరు నేతలు విడివిడిగానే కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో సైతం అయోమయం నెలకొంది. జగిత్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మారు గంగారెడ్డి పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మరో పేరు ప్రతిపాదించడంతో పాలకవర్గం నియామకం పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో సభ్యుల పేర్ల విషయంలోనూ ఇదే తీరు ఉందని వారు పేర్కొంటున్నారు. ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారి పేర్లు కాకుండా భారాసకు చెందిన వారి పేర్లను ఎమ్మెల్యే ప్రతిపాదిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో భారాసలో పని చేసిన యువకుడు గంగారెడ్డిని హతమార్చడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. గంగారెడ్డి హత్య నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆందోళనకు దిగగా, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పార్టీ శ్రేణులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గంగారెడ్డి హత్యను విప్ లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని అండగా ఉంటానన్నారు. గంగారెడ్డి హత్యను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



రోడ్డుపై బైఠాయించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

హతమార్చి.. లొంగిపోయి

గంగారెడ్డి హత్య కేసులో నిందితుడు సంతోష్ ఘటన తరవాత నేరుగా జగిత్యాల గ్రామీణ ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. అతన్ని పోలీసులు విచారిస్తున్నారు. పలు విషయాల్లో అడ్డు తగలడంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. కాగా నిందితుడు లొంగిపోగానే సామాజిక మాధ్యమాల్లో సంతోష్ జగిత్యాల గ్రామీణ పోలీసుస్టేషన్‌లో చిత్రీకరించిన ఓ పాత వీడియో వైరల్‌గా మారడంతో కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

ఆందోళనలోనూ దేశభక్తిని మరవక...

గంగారెడ్డి హత్యను నిరసిస్తూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో సహా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాత బస్టాండ్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగగా అదే సమయంలో ఉదయం 9.30 గంటలకు నిత్య జనగణమన గీతం మైకులో వినిపించగా ఆందోళన చేస్తున్న వారంతా లేచి నిలబడి వందనం చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు.

నేడు ఉద్యోగ మేళా

సిరిసిల్ల(విద్యానగర్): ప్రదీప్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు గెంట్యాల భూమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని మహతి డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ రంగానికి సంబంధించి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం 50 శాతం ఉత్తీర్ణతతో డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8374221804 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

దుర్వాసనతో ప్రయాణికుల ఇబ్బందులు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లోని మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక బస్టాండ్ మొత్తం దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్‌లోని మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు ముక్కు మూసుకొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇళ్లు ఇచ్చారు... వసతులు మరిచారు

న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం

గూడు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. పనుల్లో నాణ్యత లేక ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు తడి వస్తుంది. కింది బ్లాక్‌లో ఉన్న ఇళ్లలోకి వరద రావడం, రాత్రి వేళ విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కేసీఆర్ నగర్ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల కోసం 1,220 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. మండెపల్లికి చెందిన మరో 80 మందికి ఇక్కడే నిర్మించి పంపిణీ చేశారు. ఈ కాలనీకి కేసీఆర్‌నగర్‌గా నామకరణం చేశారు.




రహదారి పక్కన వేసిన చెత్తాచెదారం

ఖాళీ చేసి వెళ్లిపోయిన లబ్ధిదారులు

- కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లను ఖాళీ వెళ్లిపోయి సిరిసిల్లలో అద్దెకు ఉంటున్నారు. ఉన్న సగం మంది సమస్యలతో సతమతమవుతున్నారు.
- ఎవరైనా చనిపోతే కనీసం శ్మశానవాటిక లేదు.
- పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారాన్ని కాలనీవాసులు రహదారికి ఇరువైపులా పడేయడంతో దుర్వాసన వస్తోంది.
- ఈ కాలనీకి కేవలం మిషన్ భగీరథ నీరే ఆధారం. ఆ నీరు రాకపోతే స్థానికులు నానా పాట్లు పడాల్సి వస్తుంది.

పంచాయతీగా ఏర్పాటు చేయాలి



మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అధికారులు వసతులు కల్పించాలి. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి. కేసీఆర్‌కాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి. - కట్ట రవి, కేసీఆర్‌నగర్

నిర్వహణ ఎవరిది?

కేసీఆర్‌నగర్‌లో కనీస మౌలిక వసతులు కల్పించే బాధ్యతను మొన్నటి వరకు వరకు చేపట్టిన మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితం చేతులు ఎత్తేశారు. దీంతో కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వారితో మాట్లాడి తాత్కాలికంగా తంగళ్లపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం ప్రశ్నార్థకంగా మారింది. చాలా రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళలో పాములు వస్తుండటంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మూడో అంతస్తుకు నీళ్లు రాకపోవడంతో కింది నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేసీఆర్ నగర్ కమాన్

పారిశుద్ధ్య నిర్వహణ లేదు



ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ లేదు. ఇళ్ల ముందు భాగం, మధ్యలో గడ్డి పెరిగి పాములు, తేళ్లు, విష పురుగులు వస్తున్నాయి. చీకటి వల్ల రాత్రి పూట బయటకు రాలేకపోతున్నాం. బ్లాక్‌లో మూడో అంతస్తులో ఉన్న వారు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. - బల్ల కవిత, స్థానికురాలు

అన్ని చర్యలు తీసుకుంటాం

తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం.

- లక్ష్మీనారాయణ, ఎంపీడీవో, తంగళ్లపల్లి

చెంజర్ల గడ్డ.. ఉద్యోగుల అడ్డా

☛ ఒకే ఊరిలో 70 మంది ఉపాధ్యాయులు
☛ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం

గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది. తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.

- న్యూస్‌టుడే, మానకొండూర్


చెంజర్ల గ్రామం

మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, బీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో.. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంత మంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.

వృత్తిపై మమకారం



ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికై పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టీటీసీ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.

- బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్

సీనియర్ల స్ఫూర్తితో..



సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకూ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.

- దాసరి శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్

మొదటి ప్రయత్నంలోనే..



నేను మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడానికి కారణం మా గ్రామమే. ఇంత మంది గురువులను చూసి అందులో నేనూ ఒకడిని కావాలని అనుకొని ఆ దిశగా ప్రయత్నం చేశాను. ఆత్మ విశ్వాసం కోల్పోయిన ప్రతీసారి నన్ను స్నేహితులు ప్రోత్సహించారు. చివరకు ఇటీవలి ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికవడం సంతోషాన్నిచ్చింది.

- బుర్ర శ్రీనివాస్, ఎస్జీటీ

గ్రామంలో ఉద్యోగుల సంఖ్య ఇలా..

★ మొత్తం ఉపాధ్యాయులు 70 (వీరిలో అయిదుగురు విశ్రాంత ఉపాధ్యాయులుండగా.. మరో ఇద్దరు చనిపోయారు.)
★ కానిస్టేబుళ్లు 17 ★ ఆర్టీసీ కండక్టర్లు 5 ★ పంచాయతీ కార్యదర్శులు 3 ★ సింగరేణి సంస్థలో.. 3 ★ జూనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ 2
★ టెక్నికల్ అసిస్టెంట్, ఐఐటీ మద్రాస్ 1 ★ ట్రాన్స్‌కో ఏడీఈ (అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్) 1 ★ ఆర్ఐ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ పోస్ట్‌మెన్ 1
★ జూనియర్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ జూనియర్ అసిస్టెంట్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ 1 ★ ఆర్టీసీ మెకానిక్ 1

అమ్మ భాషలో ఆణిముత్యాలు

తెలుగులో డాక్టరేట్ సాధించిన అక్కాచెల్లెళ్లు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం


శ్రీనివాస్‌తో కుమార్తెలు శరణ్య, హర్షిత

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు.. తండ్రి ఆశయం మేరకు తెలుగుపై మక్కువ పెంచుకున్న వీరు ఒకేసారి డాక్టరేట్ సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని బుక్కవాడకు చెందిన వైద్యుడు వేముల శ్రీనివాస్-సాయిసుధ దంపతుల కుమార్తెలు శరణ్య, హర్షితకు చిన్నప్పటి నుంచే తెలుగు భాషపై మక్కువ. హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు టాపర్స్‌గా నిలిచి శరణ్య, హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో ఒకేసారి డాక్టరేట్ అందుకున్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకురాళ్లుగా ఒకేసారి ఉద్యోగాలు సాధించిన వీరు ప్రొఫెసర్లు కావడమే తమ లక్ష్యమంటున్నారు.

■ శరణ్య 1 నుంచి 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి 5 ఏళ్ల పాటు మొదటి ర్యాంకు సాధించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో మొదటి స్థానం సాధించి మెరిట్ బంగారు పతకం, డిగ్రీ స్థాయిలో సంస్కృతంలో అత్యధిక మార్కులు పొంది రెండో బంగారు పతకం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో మొదటి స్థానంలో నిలిచి విశ్వవిద్యాలయం పరిధిలో ఉమెన్ టాపర్‌గా నిలిచి 2013లో అప్పటి గవర్నర్ చేతుల మీదుగా మెరిట్ బంగారు పతకం అందుకున్నారు. తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు వద్ద శ్రీనాథుని కవితా ప్రస్థానం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతోపాటు కవితలు, పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. పలు టీవీ ఛానళ్లలో తెలుగుపై చర్చా కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 2019లో గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

■ హర్షిత 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో చదివి మండల టాపర్‌గా నిలిచి ఐఐఐటీ బాసరలో సీటు సాధించారు. తెలుగు భాషపై మక్కువతో ఐఐఐటీ సీటును వదిలేసి అక్క నడిచిన మార్గంలోనే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో టాపర్‌గా నిలిచి 2016లో మూడు మెరిట్ మెడల్స్‌ని కైవసం చేసుకున్నారు. ఇదే విశ్వవిద్యాలయంలో సాహిత్య వ్యాసాలు విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె తాజాగా తెలుగులో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకున్నారు.

ఆర్టీఏలో పొరుగు సేవల సిబ్బందిపై వేటు

న్యూస్‌టుడే - కరీంనగర్ రవాణావిభాగం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేసే కొందరు డీబీఏలపై (డాటా బేస్డ్ ఎంట్రీ ఆపరేటర్స్, ప్రస్తుతం వీరిని టెక్నికల్స్ సపోర్ట్ ఇంజినీర్స్ అని పిలుస్తున్నారు) వేటుకు రంగం సిద్ధమైంది. కొన్నేళ్లుగా ఆర్టీఏ కార్యాలయాల్లో పని చేసే ఈ సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో దశల వారీగా వీరికి ఉద్వాసన పలకాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

వీరిది కీలకపాత్ర...

రవాణా శాఖ కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ద్వారా నియామకమైన డీబీఏలు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఆ శాఖకు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల ముద్రణ తదితర పనులు వీరే చూసుకుంటున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు లేకపోయినా పనులు చక్కబెడుతున్నారు. ఈక్రమంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆరోపణలు వచ్చిన వారిని తొలగించాలని సర్కారు నిర్ణయించింది. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పనిచేసే మురళీకృష్ణపై వేటుపడింది. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఉమ్మడి జిల్లా ఉప రవాణా కమిషనర్ పెద్దింటి పురుషోత్తంను వివరణ కోరగా నిజమేనని ధ్రువీకరించారు.

అందరిలో ఆందోళన..

ఉమ్మడి జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిలో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోననే భయాందోళనలో ఉన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా కలిసి డీబీఏ ఉద్యోగులు విన్నవించినట్లు తెలిసింది.

సన్నాల కొనుగోళ్లలో నూతన విధానానికి శ్రీకారం

నిబంధనలకు లోబడి ఉంటేనే ధాన్యానికి రూ.500 బోనస్

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్


గ్రెయిన్ కాలిపర్ పరికరం

రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 ఇస్తామని ప్రకటించడంతో ధాన్యం సేకరణ నాణ్యత, నిర్ధారణలో నిబంధనలు కఠినతరం చేసింది. పొరపాట్లు జరగకుండా సన్న రకాలను కొనుగోలు చేసేందుకు తొలిసారిగా సాంకేతిక విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్షేత్రంలోకి దిగిన అధికార యంత్రాంగం రైతులను చైతన్యం చేసే పనిలో నిమగ్నమైంది

ప్రత్యేక పరికరంతో పరిశీలన

ధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేస్తోంది. ఏఈవోలు 'ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ' పరికరంతో దొడ్డు, సన్న రకాలు గుర్తించకుండా తేమ, తాలు, రాళ్లు, రప్పలు తదితర ప్రమాణాల శాతాన్ని పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా చోట్ల ఏఈవోలు నామమాత్రంగానే ధాన్యం సేకరణలో భాగస్వామ్యం అవుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. పని ఒత్తిడి భారంతో కేంద్రాలకు వెళ్లకుండానే ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఇస్తున్నారు. మద్దతు ధర తప్పితే సన్న వడ్ల గుర్తింపుపై ఇప్పటివరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో గ్రెయిన్ కాలిపర్(డయల్ మైక్రోమీటర్) పరికరాన్ని వినియోగించనున్నారు. వీటి కొనుగోలు బాధ్యతను మార్కెటింగ్ శాఖ తీసుకొంది. గింజ పొడవు, వెడల్పు కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వినియోగించనున్నారు. నాణ్యతను కూడా ఈ పరికరం గుర్తిస్తోంది. ప్రమాణాలు పాటిస్తేనే ప్రభుత్వ బోనస్ అందనుంది.

జిల్లాల వారీగా వరి సాగు విస్తీర్ణం (ఎకరాలు లక్షల్లో..)
కరీంనగర్: 2.76
పెద్దపల్లి: 2.09
జగిత్యాల: 3.16
సిరిసిల్ల: 1.81

ఉమ్మడి జిల్లాలో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 3.76 లక్షల ఎకరాల్లో సన్న రకం సాగైంది.

నిర్ధారణే సమస్య

33 రకాల సన్నాలకు బోనస్ అందనుండటంతో ధాన్యం సేకరణలో సన్న రకాల నిర్ధారణ సవాలుగా మారింది. గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండి.. పొడవు, వెడల్పు నిష్పత్తి 2:5 కన్న ఎక్కువ ఉండకుంటేనే బోనస్ ఇవ్వనున్నట్లు ఆంక్షలు పెట్టారు. తేమ శాతం ఉన్న ధాన్యంలో కొన్ని గింజల పొట్టు తీసి గ్రెయిన్ కాలిపర్ పరికరం సన్న, దొడ్డు రకాలుగా నిర్ధారణ తేల్చుతుంది. వ్యవసాయ శాఖ నిర్ధారిస్తేనే కొనుగోలు చేసి బోనస్ ఇవ్వనున్నారు.

వేర్వేరుగా సేకరణ

కేంద్రాల్లో ధాన్యాన్ని వేర్వేరు చోట్ల కొనుగోలు చేస్తారు. అనంతరం సన్నాలు, దొడ్డు రకం ధాన్యం గుర్తించేందుకు సంచులకు రెండు రకాల దారంతో కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్నారు. సన్నాలు నిల్వ చేసిన సంచులను ఎరుపురంగు దారంతో కుట్టి.. వాటిపై 'ఎస్' అక్షరం రాస్తారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారం వాడతారు. మిల్లుల్లో వేర్వేరుగా వీటిని భద్రపరుస్తారు. సన్నాల నిర్ధారణలో రాజకీయ పలుకుబడికి తలొగ్గకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిబద్ధత పాటించాలి. అప్పుడే అర్హులైనా రైతులకు బోనస్ దక్కుతోంది.

కేంద్రాలకు పరికరాలను సమకూరుస్తాం

- శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

సన్నాలకు బోనస్ చెల్లించడంలో నిర్ధారణ కీలకమైంది. ధాన్యం పరిమాణాన్ని నిర్ధారించేందుకు కొత్తగా గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వాడనున్నాం. కేంద్రాలకు సరిపడా పరికరాలను సమకూర్చనున్నాం. సన్నాల కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేస్తాం. నిబంధనలకు లోబడి ఉంటేనే బోనస్ రానుంది.

చిమ్మచీకటిలో ఈత చెట్టు కింద 15 గంటలు

ప్రమాదవశాత్తు పడి రాత్రంతా ఉండిపోయిన గీతకార్మికుడు


ఈత చెట్టు కింద నర్సయ్యగౌడ్

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి 15 గంటల పాటు నరకయాతన అనుభవించిన ఘటన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ సోమవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి కింద పడ్డారు. వెన్నెముక, ఇతర అవయవాలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టూ దట్టమైన చెట్ల పొదలుండటం, ఎవరూ చూడకపోవడంతో నర్సయ్యగౌడ్ లేవలేని స్థితిలో అక్కడే ఉండిపోయారు. భారీ వర్షం కురవడంతో తడుస్తూ ఆర్తనాదాలు చేసినా ఫలితం లేకపోయింది. భార్య సరమ్మ అల్లూరులో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న నర్సయ్య ఇంటికి రాని విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వర్షానికి తడిసి చలిలో, గాయాల బాధతో విలవిలలాడారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటు వైపు వెళ్లిన గ్రామస్థులకు నర్సయ్యగౌడ్ అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. గోదావరిఖని ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు, అనంతరం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెన్నెముక, పక్కటెముకలకు బలమైన గాయాలు కావడంతో నర్సయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎమ్మెస్సీ గణితం ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ గణితం(బ్యాక్‌లాగ్) రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in. లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభమవుతున్నాయని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 30 నుంచి ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గంగులకు మాతృ వియోగం


లక్ష్మీనర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ సునీల్‌రావు


లక్ష్మీనర్సమ్మ

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి గంగుల లక్ష్మీనర్సమ్మ మంగళవారం ఉదయం కరీంనగర్‌లో మృతి చెందారు. దుబాయిలో ఉన్న కమలాకర్‌కు ఈ విషయం తెలియడంతో అక్కడి నుంచి బయలుదేరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, భారాస నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తదితరులు లక్ష్మీనర్సమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి.

మంత్రుల సంతాపం

ఆమె మృతికి మంత్రి శ్రీధర్‌బాబు, సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపాన్ని ప్రకటించారు. గంగుల లక్ష్మీనర్సమ్మ అకాల మరణం తమను కలిచి వేసిందన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటనలో సంతాపం తెలిపారు.

కుటుంబ సభ్యులకు కేసీఆర్ సానుభూతి

ఈనాడు, హైదరాబాద్ : గంగుల లక్ష్మీనర్సమ్మ మరణంపై మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ మంగళవారం సంతాపం ప్రకటించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలు కూడా సంతాపం తెలియజేశారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు

రాజన్న భక్తులకు తిప్పలు

న్యూస్‌టుడే, వేములవాడ


ఆలయ పార్కింగ్ స్థలంలో తాళం వేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రూ.10 లక్షలు వెచ్చించి ఆలయ పార్కింగ్ స్థలంలో వీటిని నిర్మించారు. తరవాత వాటి నిర్వహణను ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో భక్తులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు పార్కింగ్ స్థలంలోని నల్లాల వద్ద స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వెళ్తున్నారు.


స్నానాల గదులదీ అదే పరిస్థితి

టెండరు పిలిచినా...

ఆలయ పార్కింగ్ స్థలంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆలయ అధికారులు ఈ ఏడాది మార్చిలో టెండర్లు పిలిచి నిర్వహణ బాధ్యతలను ఓ సొసైటీకి అప్పగించారు. మొదట్లో వాటి నిర్వహణ సక్రమంగానే ఉన్నా తరవాత గాలికి వదిలేశారు. నిబంధనల ప్రకారం భక్తులు వచ్చినా, రాకున్నా వాటిని రోజూ తెరిచి ఉంచాలి. ముఖ్యంగా ఆది, సోమ, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. పార్కింగ్‌లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు మూసి ఉంచడంతో భక్తుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా కంటెయినర్లు

మహా శివరాత్రి సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్లకు సంబంధించిన కంటెయినర్లను లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కింగ్ స్థలంలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటిని వినియోగంలో ఉంచిన దాఖలాలు లేవు. వాటి నిర్వహణను కూడా పట్టించుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

పార్కింగ్ స్థలంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులను తెరిచి ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాం. టెండరు పిలిచి భక్తులకు ఇబ్బందులు లేకుండా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం. - **వరి నర్సయ్య, శానిటరీ విభాగం అధికారి, రాజన్న ఆలయం**

శ్రీరామసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద రాక కొనసాగింది. 26,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 5 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఇతర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ కలుపుకొని ఔట్‌ఫ్లోను ఇన్‌ఫ్లోతో సమానంగా కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటి నిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు జమ్మికుంట మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే ఈ కేంద్రంలో ఖరీదు చేస్తామన్నారు. నాణ్యత బట్టి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 నుంచి రూ.7,220కు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పత్తి పింజ పొడవును బట్టి మద్దతు ధరలో వ్యత్యాసాలు ఉంటాయన్నారు.



ఇల్లంతకుంటలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతిగా కుమార్‌ను నియమించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యే సత్యనారాయణ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సరైన ప్రాధాన్యం ఇస్తుందనడానికి కుమార్ నియామకం నిదర్శన మన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశం, పసుల వెంకటి, వినయ్‌కుమార్, బడుగు లింగం, ఎలగందలు ప్రసాద్, వీరేశం, సురేందర్‌రెడ్డి, నరేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

బండలింగంపల్లి (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. హుండీని ధ్వంసం చేసి, అందులోని రూ. 4 వేల నగదు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన నర్ర అంజిరెడ్డి ఆలయ నిర్వహణ బాధ్యతలను చూస్తున్నాడని, భక్తుల దర్శనం తర్వాత ఉదయం ఆలయానికి తాళం వేశాడని తెలిపారు. సాయంత్రం వెళ్లి చూడగా దొంగతనం చోటుచేసుకున్నట్లు గుర్తించాడన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

నేర వార్తలు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోయినపల్లి, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. తడగొండ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో మాన్వాడ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు రావడంతో డ్రైవర్ల వద్ద వేబిల్లులను పరిశీలించారు. వేబిల్లుపై జారీ చేసిన తేదీల్లో మార్పులు ఉన్నట్లు గుర్తించారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వేములవాడ గ్రామీణం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును వేములవాడ గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వేములవాడ పట్టణం నుంచి మర్రిపల్లికి ఇసుక తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మారుతి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి నుంచి తాళ్లపెల్లి గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ ఓరుగంటి అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం...

వేములవాడ గ్రామీణం: అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ గ్రామీణ ఎస్సై మారుతి తెలిపారు. మర్రిపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం... కాపాడిన పోలీసులు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: అప్పు కట్టలేక ఆత్మహత్యకు పూనుకొన్న ఓ వ్యక్తిని తంగళ్లపల్లి పోలీసులు మంగళవారం కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి మైక్రో ఫైనాన్స్‌లో అప్పు తీసుకున్నాడు. ఫైనాన్స్ వారు రోజూ వచ్చి అప్పు కట్టమని అడుగుతున్నారు. కట్టలేక మానేరు వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యకు పూనుకోగా అటుగా వెళ్తున్న తంగళ్లపల్లి పోలీసులు గమనించి అడ్డుకున్నారు. అతనికి కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం
రహదారి పక్కన ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు

వేములవాడ, న్యూస్‌టుడే: మద్యం మత్తులో డ్రైవర్ అతి వేగంగా కారును నడిపి బీభత్సం సృష్టించిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా పొలాస గ్రామానికి చెందిన ప్రశాంత్ భార్యతో గొడవ పడి తన ముగ్గురు పిల్లలతో కారులో సిరిసిల్ల వైపు వెళ్తున్నాడు. మద్యం మత్తులో కారు నడుపుకుంటూ వచ్చి వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వద్ద అదుపు తప్పి బీభత్సం సృష్టించాడు. దీంతో రహదారి పక్కన నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వేములవాడ మండలంలోని శాభాష్‌పల్లికి చెందిన పరశురాములుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కారులోని ముగ్గురు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా కారు డ్రైవర్ వేములవాడ గ్రామీణ మండలంలోని వట్టెంల శివారులో ఓ శునకాన్ని ఢీకొట్టడంతో అది మృతి చెందగా దాన్ని స్థానికులు కారు డిక్కీలో వేసి పంపినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కారును సీజ్ చేసి దెబ్బతిన్న ఇతర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

శునకాల దాడిలో ఆరుగురికి గాయాలు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని అంజనీనగర్‌లో మంగళవారం సాయంత్రం శునకాలు దాడి చేసి ఆరుగురిని గాయపరిచాయి. కాలనీకి చెందిన బాబు, అయాన్, నవీన్, సాయి తదితరులతో పాటు మరో ఇద్దరిని గాయపర్చినట్లు స్థానికులు తెలిపారు. బాధితులను కుటుంబీకులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బీసీ కాలనీలో బాలుడు బోడ హార్దిక్‌పై మంగళవారం వీధి కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే అతని తండ్రి శ్రీనివాస్ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. ఇటీవల గ్రామంలో వీధి కుక్కల బెడద తీవ్రమైందని, గతంలోనూ అనేక మంది చిన్నారులపై దాడి చేశాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి వాటిని నియంత్రించాలని కోరారు.

కొండచిలువ మృతి



గుండారం (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో వరిని కోస్తుండగా యంత్రంలో చిక్కుకొని మంగళవారం ఓ భారీ కొండ చిలువ మృతి చెందింది. మాజీ సర్పంచి భూక్య శంకర్‌నాయక్ వరికోత యంత్రంతో వరిని కోయించారు. పంటలో ఉన్న కొండచిలువకు యంత్రం కట్టర్ తాకడంతో చనిపోయినట్లు తెలిపారు.





పోటీ పడి.. బహుమతి గెలిచి

సిరిసిల్లలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'అంతర్జాల వినియోగం-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో 10వ తరగతి విద్యార్థి తోట సుశ్రుత ప్రథమ, ఎక్కలదేవి అక్షర ద్వితీయ, 9వ తరగతి విద్యార్థిని సబ్బని హారిణి తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాగ్యరేఖ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాస్‌రావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ

పోత్గల్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండలం పోత్గల్ అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు అందించారని లబ్ధిదారులు మంగళవారం పేర్కొన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైనవి అందించాలని కోరారు. సంబంధిత సమాచారం అందుకున్న అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు అంజలి కేంద్రాన్ని సందర్శించారు. 5వ అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి తీసుకెళ్లిన గుడ్లలో అయిదు కుళ్లిపోయినట్లు పేర్కొన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లబ్ధిదారులకు ఇచ్చే ముందు పరిశీలించాలన్నారు.



బిందెడు నీరు రావట్లేదు?

న్యూస్‌టుడే, వీర్నపల్లి

ప్రణాళిక లేకుండా రహదారి విస్తరణ పనులు చేపట్టడంతో వీర్నపల్లి వాసులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మురుగు రోడ్లపై పారుతూ అపరిశుభ్రంగా మారుతుంది. పైపులైన్లు ధ్వంసమై తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.



నీటి కోసం బోరుబావి వద్ద మహిళలు

రోడ్డు విస్తరణతో ఇబ్బందులు

వీర్నపల్లి మండల కేంద్రంలో రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇంకా ఇళ్ల తొలగింపు చేపట్టకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు ప్రణాళిక ప్రకారం చేపట్టడం లేదు. దీంతో పైపులైన్లు ధ్వంసమై నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- సుభాష్‌నగర్ కాలనీలో సుమారు అరవైకి పైగా ఇళ్లకు సరిగ్గా నీరు రావడం లేదు. పైపులైన్లలోకి మట్టి వెళ్లడంతో చివరి ఇళ్లకు చేరడం లేదు. ఫలితంగా బిందెలతో మహిళలు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పంచాయతీలో నిధులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ఇబ్బంది అవుతుంది.



రోడ్డుపై పారుతున్న మురుగు

ఎల్లమ్మ ఆలయానికి చేరువలో బోరు ఉంది. దానికి మోటారు బిగిస్తే సుమారు నలభై కుటుంబాలకు తాగు నీటిని అందించే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పని మానుకుని...



మా ఇంటికి నీరు రావడం లేదు. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. నీటి కోసం గంటల తరబడి బోరు బావుల వద్ద వేచి ఉండాల్సి వస్తుంది. బీడీలు చుడితేనే కుటుంబం గడిచేది. పని మానుకుని నీటి కోసం వెళ్లాల్సి వస్తుంది. అధికారులు చొరవ తీసుకుని తాగు నీటి సమస్యను పరిష్కరించాలి. **- విజయ, మహిళ, వీర్నపల్లి**

నల్లాలు రావడం లేదు

మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా మా కాలనీకి తాగు నీరు సరిగ్గా రావడం లేదు. మురుగు రహదారులపై పారుతుంది. దాని మీదుగానే పాదచారులు నడవాల్సి వస్తుంది. ఆ సమయంలో వాహనాలు వస్తే ఒంటిపై పడుతుంది. అధికారులు చొరవ తీసుకుని సమస్యలు తీర్చాలి.

- కాజిబాబు, వీర్నపల్లి

పైపుల్లో మట్టి చేరడంతో...

విస్తరణ పనుల కారణంగా పైపులైన్లు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులకు సుమారు రూ. 70 వేల వరకు ఖర్చయ్యాయి. పైపులు పగిలిపోవడంతో అందులోకి మట్టి చేరింది. నీటి సమస్య ఉన్న చోట్ల ప్రత్యామ్నాయంగా ట్యాంకర్‌తో అందిస్తున్నాం. సమస్యను తీరుస్తాం.

- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, వీర్నపల్లి

ఘనంగా కుమురం భీం జయంతి వేడుకలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ అధ్యక్షురాలు అరుణ, నాయకులు కుంబాల మల్లారెడ్డి, గజభీంకార్ రాజన్న, కోడి అంతయ్య, విజేందర్‌రెడ్డి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కుమురం భీం జయంతి వేడుకలను జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్.శేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారి అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలోనూ కుమురం భీం జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేములవాడ: కళాశాలలో కుమురం భీం జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని భారాస కార్యాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో గిరిజన పోరాట యోధుడు కుమురం భీం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు అంది సుభాష్, శంకర్‌నాయక్, బాలరాజు నర్సాగౌడ్, సీత్యానాయక్, ప్రభునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ, జడ్పీ మాజీ అధ్యక్షురాలు అరుణ, భారాస నాయకులు

నిమ్మపల్లి (కోనరావుపేట): కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో కుమురం భీం జయంతి వేడుకలను లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర బాధ్యుడు బానోతు నరేశ్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మీడియా బాధ్యుడు రాజు, నాయకులు వాల్యానాయక్, మోహన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారికి సన్మానం

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో ఇటీవల మండల వ్యవసాయాధికారిణిగా విధుల్లో చేరిన మేడి కవితను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎంఏఓ భూమిరెడ్డి బదిలీ అవగా మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి కవిత ఎల్లారెడ్డిపేటకు బదిలీపై వచ్చారు. రైతులకు మెరుగైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, ఎల్లారెడ్డిపేట ఏఈఓ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కవితను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పీహెచ్‌సీ భవనం సిద్ధం చేయండి

చందుర్తి, న్యూస్‌టుడే: పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో రూ. 1.56 కోట్లతో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని మంగళవారం పరిశీలించారు. పనులు పూర్తి చేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, మండల వైద్యాధికారి సంపత్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

వేములవాడ, న్యూస్‌టుడే: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వేములవాడ పట్టణ పరిధిలో పలు కూడళ్ల వద్ద ఆటోమేటిక్ కెమెరాలు ఉన్నాయని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని చెప్పారు. పట్టణంలో శిరస్త్రాణం లేకపోయినా, మైనర్ డ్రైవింగ్, చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా ఈ కెమెరాల ద్వారా ఫొటోలు తీసి జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

వాతావరణ ఆధారిత వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన

మామిడిపల్లి (కోనరావుపేట), న్యూస్‌టుడే: మండలంలోని మామిడిపల్లిలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సాగుపై రైతులకు జర్మనీ శాస్త్రవేత్తల బృందం మంగళవారం అవగాహన కల్పించింది. వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరువ చేసేందుకు సేవ్స్ ఎన్జీవో, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సందర్శన సమావేశం నిర్వహించారు. రైతులు పాటిస్తున్న పద్ధతులు, సాంకేతిక వినియోగాన్ని అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. రైతులు సాగు చేసిన పత్తిపంటను పరిశీలించారు. సమావేశంలో ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ నుంచి డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు, జర్మనీ ఫెడరల్ మంత్రిత్వశాఖ ప్రతినిధులు, అగ్రిహబ్ ప్రతినిధి విజయ్, సేవ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న జర్మనీ శాస్త్రవేత్తల బృందం

ఆత్మగౌరవ సభ విజయవంతానికి పిలుపు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌చౌక్ వద్ద బుధవారం నిర్వహించే మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉప కులాల ఐక్యవేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్ కోరారు. మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని కోరుతూ నిర్వహించే చలో సిరిసిల్ల కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భాజపా సభ్యత్వ నమోదు

తిమ్మాపూర్ (ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో భాజపా మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొడావత్ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ బూత్ అధ్యక్షుడు ప్రకాశ్, నాయకులు కొండ ప్రశాంత్, సత్తయ్య, దండు నవీన్, న్యాలపల్లి సతీశ్, జిల్లెల్ల రాజు, శేఖర్, భరత్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన అవసరం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, లేదంటే వచ్చే నెల 4న చలో హైదరాబాద్, మాజీ సర్పంచుల పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యాగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరితే, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, అంజయ్య, గణప శివజ్యోతి, వేణుగోపాల్ రావు, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులను నిరసిస్తూ ఎల్లారెడ్డిపేటలో బీజేవైఎం నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి రాష్ట్రంలో హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు చేస్తూ దేవతా విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మార్పు దయాకర్‌రెడ్డి, వంగల సనత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: టాస్క్, కెరీర్ గైడ్ సెల్‌లో చేరిన డిగ్రీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని కరీంనగర్ టాస్క్ రిసోర్స్‌పర్సన్ గంగా ప్రసాద్ తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాలయంలోని డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో టాస్క్, కెరీర్ గైడ్ సెల్ సమన్వయకర్త జె.శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గంగాప్రసాద్ మాట్లాడుతూ టాస్క్‌లో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్, ఉద్యోగ ఆధారిత నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం టాస్క్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మంగళవారం ఇల్లంతకుంట మండలంలోని ప్రభుత్వ కళాశాలలో ఓటర్ నమోదు నిర్వహించారు. వంగ మహేందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీఆర్టీయూ మండల గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు ఐరెడ్డి ప్రదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమం

నల్లకుంట, న్యూస్‌టుడే: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి ప్రాంతానికి చెందిన సీహెచ్.శ్రీనివాస్‌ను, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా సిరిసిల్ల పట్టణానికి చెందిన మేకల పరశురాములును నియమించి వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, ఉదయ్, పృథ్వీగౌడ్, బలరామ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులను జాగ్రత్తగా సంరక్షించాలి

తిమ్మాపూర్(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: పాడి పశువులను రైతులు కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ, గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యాధులు రాకుండా పశువులకు టీకాలు వేశారు. పశువుల్లో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ, గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువుల్లో ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే వెంటనే స్థానిక పశువైద్యాధికారులు, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రేణుక, వీఎల్‌వో నరేందర్, ఎల్ఎస్ఏ శ్రీనివాస్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇల్లంతకుంట మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మాచారి, శ్రీనివాస్, మహిపాల్, లక్ష్మీనర్సింహస్వామి, యాద రవి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించడంతోపాటు పీఆర్సీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గనికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈనెల 26న నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను ఆయా పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, మెడికల్, సరెండర్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ గ్యారంటీలు, ఇతర బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్, నాయకులు గిరిధర్, వెంకట్ రెడ్డి, మండల బాధ్యుడు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కోనరావుపేట, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు సంకినేని రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొలనూర్, పల్లిమక్త, నాగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కాశవేణి మహేశ్‌యాదవ్, సీఈవో రాజేశం, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కొలనూర్‌లో ప్రారంభిస్తున్న అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తదితరులు